అటు గుంతలు.. ఇటు రాళ్లురప్పలు





ఖమ్మం-సూర్యాపేట టోల్ రోడ్డు ప్రారంభానికి ముందు పొన్నేకల్లు వద్ద ఇరువైపులా మార్జిన్లు ప్రమాదకరంగా తయారయ్యాయి. ఓ వైపు లోతైన గుంతలుంటే, ఇంకోవైపు మార్జిన్‌లో రాళ్లు రప్పలు కనిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో మార్జిన్లను మెత్తటి మట్టితో చదును చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. టోల్ రోడ్డు ముగిసిన చోట ప్రస్తుతం విస్తరణ పనులు కొనసాగుతున్నాయని, గుంతల్లో పోసిన రాళ్లు రప్పలను వెంటనే చదును చేయిస్తామని హైవే అధికారి దివ్య 'ఈనాడు'కు తెలిపారు.


- ఈనాడు, ఖమ్మం

భరోసా.. రభస

రైతులకు వానాకాలం అందాల్సిన పెట్టుబడి సాయం.. రూ.568 కోట్లు

రైతులకు పెట్టుబడి 'భరోసా' ఎక్కడని ప్రతిపక్షాలు రోడ్డెక్కాయి. 'రైతు భరోసా' పథకంపై ప్రభుత్వ వైఖరే మిటో చెప్పాలని ఆందోళన చేస్తున్నాయి. వాస్తవానికి ఈ వానాకాలం పెట్టుబడి సాయంగా ఉమ్మడి జిల్లా రైతులకు రూ.568 కోట్లు అందాల్సి ఉందని అంచనా. ఈ అంశంపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం తుది నిర్ణయం అనంతరం, ఈ యాసంగి నుంచే హామీని నిలబెట్టుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తాజాగా వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో పరిస్థితిని పరిశీలిస్తే..

- ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే



'రైతుబంధు' పథకాన్ని గత ప్రభుత్వం 2018, మే నెల 10న ప్రారంభించింది. తొలి ఏడాది ఎకరాకు రూ.4 వేల చొప్పున రెండు సీజన్లకు రూ.8 వేల పెట్టుబడి సాయాన్ని విడుదల చేశారు. 2019, వానాకాలం సీజన్ నుంచి ఎకరాకు రూ.5 వేల చొప్పున ఏడాదికి మొత్తం రూ.10 వేలకు సాయం పెంచారు. ఆ తర్వాత అదే మొత్తాన్ని వర్తింపజేస్తూ వచ్చారు. మొత్తం 12 సీజన్లకు పెట్టుబడి సాయం అందింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 'రైతుబంధు' స్థానంలో 'రైతు భరోసా' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఎకరాకు ఒక సీజన్‌కు రూ.7,500 చొప్పున, రెండు సీజన్లకు రూ.15 వేల పెట్టుబడి సాయం అందిస్తామన్నది ఎన్నికల హామీ. విధివిధానాల ఖరారుకు మంత్రి వర్గ ఉప సంఘాన్ని నియమించింది. ఇంకా నిర్ణయాలు ఖరారు కావాల్సి ఉంది. ఈ లోపు వానాకాలం సీజన్ పూర్తయిపోయింది. యాసంగి సీజన్‌కైనా సాయం అందేనా? అని రైతులు నిరీక్షిస్తున్నారు. దీనిపై తాజాగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టత ఇచ్చారు. రెండో సీజన్‌లో రైతుల ఖాతాలకు నగదు అందజేస్తామని చెబుతున్నారు.

ఈ సీజన్‌లో అంచనా ఇలా...

జిల్లా	రైతుల సంఖ్య	అందాల్సిన సాయం (రూ.కోట్లలో)..
ఖమ్మం	3,29,892	362.94
భద్రాద్రి	1,34,192	205.15

రుణమాఫీ.. ఆపై అననుకూల వాతావరణం

ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. పలు నిబంధనల వల్ల పూర్తిస్థాయిలో రుణమాఫీ కాకపోవటంతో రైతులు చాలా మంది ఆందోళన చెందుతున్నారు. ఇదే క్రమంలో వారికి 'రైతు భరోసా' సాయం కూడా అందక నిరాశ వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఈ సీజన్ అంతగా ఆశాజనకంగా లేదు. ఆదిలోనే భారీ వర్షాలు, వరదలు, ప్రతికూల వాతావరణంతో ప్రధాన పంటలైన పత్తి, వరి, మిరప పైర్లు దెబ్బతిన్నాయి. ఉమ్మడి జిల్లాల్లో వేలాది ఎకరాల్లో పెట్టుబడులూ అందే పరిస్థితి లేదు.

● 'రైతు భరోసా'పై త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. త్వరలో పెట్టుబడి సాయం విడుదల అవుతుందని ఖమ్మం జిల్లా డీఏఓ పుల్లయ్య 'న్యూస్‌టుడే'తో అన్నారు.

వానాకాలం / యాసంగి — రైతులు, సాయం మొత్తం (రూ.కోట్లలో)

సంవత్సరం	వానాకాలం రైతులు	వానాకాలం సాయం	యాసంగి రైతులు	యాసంగి సాయం
2018-19	2,65,687	260.12	2,52,572	255.26
2019-20	2,60,960	277.15	2,19,013	207.2
2020-21	2,91,681	351.78	2,96,468	355.95
2021-22	3,01,641	354.97	3,07,611	355.43
2022-23	3,16,174	356.17	3,11,650	350.98
2023-24	3,29,892	362.94	3,11,650	350.98

సర్వజన అవస్థలు

ఖమ్మం జిల్లా ఆసుపత్రికి అనుబంధంగా వైద్య కళాశాల ఏర్పాటు చేయడంతో సర్వజనాసుపత్రిగా రూపాంతరం చెందింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట తదితర ప్రాంతాల నుంచి రోగులు వైద్యం కోసం వస్తుంటారు. పలు విభాగాల్లో అవార్డులు, రివార్డులూ అందుకుంది. నేడు సదుపాయాలు కొరవడి సతమతమవుతోంది. నిపుణుల కొరత, పని చేయని పరికరాలు, ఆర్థిక ఇబ్బందులతో కునారిల్లుతోంది. పేదలు వైద్యమందక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే

పడకేసిన పరికరాలు



ఇటీవల సిటీ స్కానింగ్ యంత్రానికి విద్యుత్తు సరఫరా చేసే వైరు కాలిపోయి సేవలు నిలిపివేశారు. కొత్త తీగకు రూ.3.50 లక్షలు ఖర్చవుతుందని అంచనా. నిధుల లేక అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఎక్స్‌రే విభాగంలో కంప్యూటెడ్ రేడియోగ్రఫీ(సీఆర్) పరికరం పని చేయడం లేదు. ఇది ఎక్స్‌రే చిత్రాలను నాణ్యమైన డిజిటల్ ఫార్మాట్‌లోకి మారుస్తుంది. సాంకేతిక సమస్యలతో ఎక్స్‌రే సేవలు నిలిచిపోయాయి. ప్రతిరోజు 200లకు పైగా ఎక్స్‌రేలు తీస్తారు. నిపుణుడు అందుబాటులో లేకపోవడంతో మరమ్మతులు చేయడంలో జాప్యం జరుగుతోంది. ప్రత్యామ్నాయంగా పరికరాలను ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నా రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.



ఐసీయూలో పనిచేయని ఏసీలు

ఉష్ణోగ్రత నియంత్రణ అస్తవ్యస్తం

ఐసీయూ(ఇంటెన్సివ్ కేర్ యూనిట్)లో ఏసీలు పని చేయడం లేదు. ప్రాణాపాయ స్థితిలో రోగులకు ఇక్కడ చికిత్సలు అందిస్తారు. రోగుల ఆరోగ్యం నిలకడగా ఉండేందుకు శీతల వాతావరణం అవసరం. ఏసీలు మరమ్మతులకు గురి కావడంతో రోగుల ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. అధిక ఉష్ణోగ్రతలు శరీర వేడిని పెంచడంతో ఆక్సిజన్ స్థాయిలు తగ్గుతాయి. బ్యాక్టీరియా, వైరస్‌లు వేగంగా వ్యాపిస్తాయి. ఇన్‌ఫెక్షన్ల తీవ్రత పెరిగే ప్రమాదం ఉంది. రోగులు, సిబ్బంది దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు.



ఓపీ విభాగం వద్ద బారులు తీరిన రోగులు

ఆన్‌లైన్ సేవలు ఆలస్యం..

ఆస్పత్రిలో ఓపీ నమోదు నుంచి వ్యాధి నిర్ధారణ పరీక్షల నివేదికల జారీ వరకు ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ సమస్యలు, సర్వర్లు మొరాయించడం, ప్రింటర్లు పని చేయకపోవడం, సిబ్బంది కొరత కారణంగా ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఓపీ నమోదు చీటీల కోసం గంటల తరబడి బారులుదీరాల్సిన పరిస్థితి. అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన రోగులు వేచి ఉండలేక నీరసించిపోతున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల నివేదికలు సకాలంలో అందడం లేదు. నిర్దిష్ట సమయంలో నివేదికలు అందక వైద్య నిర్ణయాలు తీసుకోవడం ఆలస్యమవుతోంది.

రేడియాలజిస్టుల కొరత..

పలు విభాగాల్లో పరికరాలున్నా రేడియాలజిస్టులు లేక పరీక్షలు చేయడం లేదు. గర్భధారణ శిశువు ఎదుగుదల నిర్ధారణకు 18, 23 వారాల్లో టిఫా పరీక్షలు చేయాలి. రెండు పరికరాలున్నా నిపుణులు లేరు. పలుమార్లు నోటిఫికేషన్ జారీ చేసినా ఎవరూ రావడం లేదు. ప్రభుత్వం రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయడం లేదు.

☆ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా పరికరాల మరమ్మతులకు టెక్నీషియన్లు బయట నుంచి రావాల్సి ఉందని.. ఆర్థిక అవసరాలు, నిపుణుల నియామకం అంశాలను ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. అత్యవసర రోగులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.



నేలకొండపల్లిలో ధర్నాలో పాల్గొన్న ధనలక్ష్మి, ఉన్నం బ్రహ్మయ్య, నాగుబండి తదితరులు

రైతుకు సాయం మరిచారు: భారాస

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం వానాకాలం 'రైతు భరోసా' పెట్టుబడి సాయాన్ని వెంటనే విడుదల చేయాలని భారాస నాయకులు డిమాండ్ చేశారు. రైతు భరోసాలో జాప్యాన్ని నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా ఆదివారం ఆందోళనలు చేపట్టారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో రాస్తారోకో చేపట్టిన అనంతరం భారాస నాయకులు మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో సీజన్‌కు ముందుగానే సాయాన్ని అందించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాయం మాటే మరిచిపోయారని విమర్శించారు. ఆందోళనలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు మరికంటి ధనలక్ష్మి, పార్టీ మండలాధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, నాయకులు నాగుబండి శ్రీనివాసరావు, మరికంటి రేణుబాబు పాల్గొన్నారు.

నేటి నుంచే ఎస్‌ఏ-1 పరీక్షలు

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: నేటి నుంచి జిల్లాలో 1-10వ తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్(ఎస్‌ఏ-1) పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈనెల 28 వరకు పరీక్షలు కొనసాగుతాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం ఇంతకు ముందే ప్రకటించింది. నవంబరు 2న జవాబు పత్రాల మూల్యాంకనం చేసి, 16న తల్లిదండ్రులు, టీచర్ల సమావేశాన్ని నిర్వహిస్తారు.

బీఫార్మసీ, ఫార్మాడీ ప్రవేశాల కౌన్సెలింగ్

ఖమ్మం విద్యావిభాగం: 'టీజీ ఎప్‌సెట్-2024' బీఫార్మసీ, ఫార్మాడీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి కళాశాలలు నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన చేపడతాయని ఖమ్మం ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మొహమ్మద్ జాకీరుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌లో భాగంగా 23 వరకు పరిశీలన కొనసాగుతుంది.

22న దిశ కమిటీ సమావేశం: కలెక్టర్

ఖమ్మం నగరం: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశాన్ని ఈ నెల 22న ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అధ్యక్షతన కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఓ ప్రకటనలో తెలిపారు.

విలీన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం: తుమ్మల



సీసీ రహదారికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలో నూతన కాలనీలు, విలీన ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ శ్రీరామ్ నగర్ 13వ వీధిలో రూ.1.95 కోట్లతో చేపట్టనున్న సీసీ రహదారి నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ... స్థానిక కార్పొరేటర్ తనపై ఒత్తిడి చేసి నిధులు తీసుకువస్తున్నారని అన్నారు. మనల్ని నమ్ముకున్న ప్రజలకు న్యాయం జరిగేలా అధికారులు, ప్రజాప్రతినిధులు పని చేయాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వలు లేకుండా యజమానులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. స్పందించని వారికి నోటీసులు ఇవ్వాలని కమిషనర్‌ను ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని చెప్పారు. వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో కొంతమందికి ఇప్పటికీ పరిహారం అందలేదని దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. నిజంగా నష్టపోయిన వారికి పరిహారం అందించేలా చర్యలు చేపడతామన్నారు. ఎన్నికల సమయంలో ప్రశాంతమైన, కబ్జాలు లేని ఖమ్మం కావాలని ప్రజలు కోరుకున్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో ఖమ్మం నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్డీఓ గణేష్, కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డివిజన్ కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు సత్యాల వెంకయ్య పాల్గొన్నారు.

'పీఎం ఆవాస్ యోజన' ఇళ్ల వివరాల తనిఖీ

ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: ఖమ్మం వైఎస్ఆర్ నగర్, మల్లెమడుగుల్లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకం భాగస్వామ్యంతో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల ఆడిటింగ్‌ను ఆదివారం నిర్వహించారు. కేంద్ర బృందాలతో కలిసి చేపట్టే ప్రక్రియ పకడ్బందీగా జరుగుతుందని ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారుల వివరాలను పోర్టల్ సమాచారంతో సరిచూశారు. వైఎస్ఆర్ నగర్‌లో 204, మల్లెమడుగులో 106 ఇళ్ల వివరాలను తనిఖీ చేశారు. ఈ బృందంలో ఎస్టీఎం సాయిజ్ఞానేందర్, ఎస్ఆర్పీ చెన్నకేశవులు, ఏపీసీ అంజగౌడ్, టీడబ్ల్యూఐడీ డీఈ రాజు, ర.భ.శాఖ ఏఈ లక్ష్మీనారాయణ, సీఎల్టీసీ సిరాజ్ ఉన్నారు.

నూతన రెవెన్యూ చట్టంతోనే న్యాయం



మాట్లాడుతున్న నాయకుడు, వేదికపై రాష్ట్ర అధ్యక్షుడు ఉపేంద్రరావు తదితరులు

ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టనున్న రెవెన్యూ చట్టం భూమాతతో ప్రజలకు, 70 లక్షల మంది రైతులకు న్యాయం జరుగుతుందని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం(టీవీఆర్వోడబ్ల్యూఏ) రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు అన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల చొరవతో పూర్వ వీఆర్వోలకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. 'గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థ, వీఆర్వోల పాత్ర' అనే అంశంపై ఖమ్మం నగరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఆయన ఆదివారం మాట్లాడారు. గత భారాస ప్రభుత్వం అమలులోకి తెచ్చిన 'ధరణి'తో 50 లక్షల మంది రైతులు బాధితులుగా మారారని అన్నారు. రాష్ట్రంలోని 5,139 మంది వీఆర్వోలు ఉద్యోగ భద్రత లేక మానసిక వేదనకు అనుభవించినట్లు చెప్పారు. వీరిలో 178 మంది బలవన్మరణాలు, మానసిక రుగ్మతలతో మరణించారన్నారు. ఈ క్రమంలో ప్రస్తుత ప్రభుత్వం 10,954 రెవెన్యూ గ్రామాలను గుర్తించడంతో పాటు ప్రతి 2 వేల జనాభాకు ఒక సహాయకుడు, సుమారు 16 వేల క్లస్టర్లలో ప్రతీ క్లస్టర్‌కు ఒక ఉద్యోగిని నియమించాలని నిర్ణయించడం సంచలన నిర్ణయమన్నారు. ఈ సమావేశంలో సున్నం రామారావు, ప్రసాద్, రామారావు, జిల్లా నాయకులు స్వామిదాసు, నాగేంద్రబాబు, సుభాని, లక్ష్మీనర్సు, కృష్ణ, యలమంద, వరలక్ష్మి, విజయలక్ష్మి, వెంకటరమణ పాల్గొన్నారు.

ఏఈ సరెండర్

చింతకాని, న్యూస్‌టుడే: చింతకాని ఏఈ (విద్యుత్) వెంకన్నను కార్పొరేట్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఎస్ఈ సురేందర్ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల లచ్చగూడెం గ్రామానికి చెందిన రైతు గూని ప్రసాద్ వరి పొలంలో పురుగుమందు పిచికారి చేస్తూ విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడిన విషయం విదితమే. మరో ఘటనలో నరసింహాపురానికి చెందిన ప్రైవేట్ సిబ్బంది రాము కూడా ఇటీవల విద్యుదాఘాతంతో తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. ఈ నేపథ్యంలో ఏఈని సరెండర్ చేశారు. ఖమ్మంలో పనిచేస్తున్న చావా శ్రీధర్ చింతకానికి బదిలీ అయ్యారు.


సుబాబుల్ లోడు.. వస్తోందంటే దడ..!

మధిర, న్యూస్‌టుడే

వివిధ ప్రాంతాల్లోని పేపర్ మిల్లులకు సుబాబుల్ లోడు లారీలు మధిర మీదుగా నిత్యం వెళ్తుంటాయి. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ, చందర్లపాడు, వీరులపాడు మండలాలతో పాటు మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని పలు గ్రామాల నుంచి వచ్చే పలు లారీలు అధిక లోడుతో.. అతివేగంగా వెళ్తున్నాయి. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కొన్ని ఘటనల్లో ఆగి ఉన్న సుబాబుల్ లోడు వాహనాలను ఢీకొని ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇరువైపులా పొడచుకు వచ్చేలా ఉండే కర్రలు తగిలి పాదచారులు గాయాలపాలయ్యే ఘటనలు అనేకం ఉన్నాయి. లోడు వాహనాలు మోటారు వాహన చట్టం నిబంధనలు పాటించటం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా రవాణా, పోలీసు శాఖ అధికారులు స్పందించి సుబాబుల్ లోడు వాహనాలను విస్తృతంగా తనిఖీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

☆ ఇటీవల ఓ సుబాబుల్ లోడు లారీ మధిర మీదుగా వెళ్తోంది. స్టేషన్ రోడ్డులోని కాంగ్రెస్ కార్యాలయం వద్దకు రాగానే లోడుకు సపోర్టుగా కట్టిన తాళ్లు తెగిపోయి సుబాబుల్ కర్రలన్నీ రోడ్డుపై పడ్డాయి. దీంతో వెనుకే ప్రయాణిస్తున్న వాహనదారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అతివేగం, సామర్థ్యానికి మించి లోడే ఈ ఘటనకు కారణం.

☆ ఏపీలోని నందిగామ ప్రాంతం నుంచి వచ్చే లారీలు దారితప్పి బైపాస్ రోడ్డులో కాకుండా గంగాధర్‌రావు మిల్లు మీదుగా వస్తున్నాయి. దీంతో విద్యుత్తు తీగలు, కేబుల్ వైర్లు తెగిపోతున్నాయి. ఇటీవల ఓ ఘటనలో విద్యుత్తు స్తంభం ఒకటి నేలకొరిగింది.



★ 'మధిర మీదుగా రోజుకు 20కు పైగానే సుబాబుల్ లోడు లారీలు ప్రయాణిస్తున్నాయి. కర్రలను లారీలో పేర్చి మోకులతో సరిగా కట్టకపోవడం వల్ల తరచూ అవి జారి రోడ్డుపై పడుతున్నాయి. పోలీసులు, మోటారు వాహన తనిఖీ అధికారులు వాహన తనిఖీలు చేపట్టాలి. వాహన ప్రమాదాలు జరగకుండా చూడాలి'.

- పి.సాంబశివరావు, స్థానికుడు

★ 'లారీలపై సుబాబుల్ కర్రలను నిబంధనల మేరకు సూచించిన ఎత్తులోనే లోడ్ చేయాలి. ఎవరైనా ఈ నిబంధనలు అతిక్రమించినా, అతివేగంతో వెళ్లినా తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటాం' అని వైరా ఎంవీఐ వరప్రసాద్ 'న్యూస్‌టుడే'తో అన్నారు.

అమ్మ స్ఫూర్తితో సింగరేణి కొలువు


కుంచపు భార్గవి

ఆ యువతిది సాధారణ మధ్యతరగతి కుటుంబం. చిన్నప్పుడే తండ్రి మరణించడంతో కష్టాలు ఆమె కుటుంబాన్ని వెతుక్కుంటూ వచ్చాయి. కానీ ఎన్ని కష్టాలు ఎదురైనా తన ఏకైక కూతురిని ఉన్నత స్థానంలో చూడాలని ఆ తల్లి కన్న కలలు, అనుభవించిన కష్టాలు అన్నీ నేడు ఫలించాయి. సింగరేణిలో అండర్ మేనేజర్ ఉద్యోగం సాధించిన తన కూతురి రూపంలో సంతోషం వారి కుటుంబంలో అడుగుపెట్టింది. మణుగూరులోని గాంధీబొమ్మ సెంటర్‌కు చెందిన కుంచపు పద్మ, రాజేందర్ దంపతుల కూతురు భార్గవి తన చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయారు. దీంతో కుటుంబాన్ని పోషిస్తూ తన చదువుకోసం తల్లి పడుతున్న కష్టాన్ని గమనించిన భార్గవి చదువులో ఉత్తమ ప్రతిభ చూపుతూ వచ్చారు. స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి వరకు చదివి 90 శాతం మార్కులు సాధించిన అనంతరం ఇంటర్‌లో 93.2 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. అనంతరం కొత్తగూడెంలోని కేఎస్ఎం మైనింగ్ కళాశాలలో బీటెక్ మైనింగ్ పూర్తి చేసి 8.56 జీపీఏ కైవసం చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది జులైలో వెలువడిన సింగరేణి ఎక్స్‌టర్నల్ మైనింగ్ అధికారుల ఉద్యోగాలకు దరఖాస్తు చేసి పరీక్ష రాశారు. అందుకు సంబంధించిన ఫలితాలు గత శనివారం విడుదల కాగా భార్గవి ఈ 2 గ్రేడ్ ఎక్స్‌టర్నల్ మేనేజ్‌మెంట్ ట్రైనీ ఉద్యోగానికి అర్హత సాధించారు. మరికొద్ది రోజుల్లో ఆమె బొగ్గు గనుల్లో అధికారిగా ప్రవేశించనున్నారు. బొగ్గు గనుల్లో మగవారికి దీటుగా మహిళ పరంగా సత్తా చాటేందుకు సిద్ధమైన భార్గవిని పలువురు సింగరేణి అధికారులతోపాటు సింగరేణి సేవా సమితి సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

– మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

చదరంగంలో పదపదా!

◆ మంచి రేటింగ్‌తో దూసుకెళ్తున్న బాలికలు


శ్రీకళ


పల్లవి


హర్షిత


సుధాశ్రీ


దివ్య


క్రీడారంగంలో అన్ని ఆటలపై ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రభుత్వ శిక్షణ, నియంత్రణ ఉంటాయి. చదరంగం ఇందుకు పూర్తిగా భిన్నమైన వ్యవస్థ. ప్రతిభ గల క్రీడాకారులు ఎప్పటికప్పుడు తమ అంతర్జాతీయ రేటింగ్‌లను మెరుగుపర్చుకునే పోటీల్లో పాల్గొంటుంటారు. వారు ఏదైనా అంతర్జాతీయ స్థాయికి వచ్చే వరకు వారి గురించిన సమాచారం బయట ప్రపంచానికి తెలియకుండా ఎదుగుతున్నారు. ఖమ్మం జిల్లాలోనూ అంతర్జాతీయ రేటింగ్ మెరుగుపర్చుకుంటున్న క్రీడాకారులు ఉన్నారు. వారు ఆదివారం ఖమ్మం నగరంలో నిర్వహించిన పాఠశాల క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చారు. నేలకొండపల్లికి చెందిన జంగం శ్రీకళ పదో తరగతి విద్యార్థిని. ఈమె గత ఏడాది చెన్నైలో జరిగిన జాతీయ స్కూల్ గేమ్స్ చెస్ పోటీలో పాల్గొంది. జిల్లా పోటీల నుంచి తిరిగి రంగంలోకి దిగింది. 1400 రేటింగ్‌లో కొనసాగుతోంది. ఎర్రుపాలేనికి చెందిన బి.పల్లవి 1403, అడవిమల్లెల గ్రామానికి చెందిన జి.హర్షిత 1435, పి.సుదశ్రీ గత ఏడాది జాతీయ పోటీల్లో పాల్గొని 1434 రేటింగ్, ఖమ్మం అంబేడ్కర్ కళాశాలకు చెందిన దర్శి దివ్య 1570 రేటింగ్‌తో అండర్ 14, 17, 19 విభాగాల్లో రాణిస్తున్నారు. వీరు చదరంగంలో ఉన్నత స్థానమే లక్ష్యంగా మహబూబాబాద్ సాంఘిక సంక్షేమశాఖ ఏర్పాటు చేసిన చదరంగం అకాడమీలో ప్రత్యేక శిక్షణలో కొనసాగుతున్నారు. చదరంగ సమాఖ్య పోటీలు, అందులో ప్రతిభను బట్టి రేటింగ్ ఇచ్చే పద్ధతి ఉంది. ఆ జాబితాలో ఈ బాలికలు ఉండటం గమనార్హం.

– ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

భళా.. చిత్రకళ..

◆ పెన్సిల్‌తో బొమ్మలు గీస్తున్న యువకుడు

ముదిగొండ, న్యూస్‌టుడే


అఖిల్ గీసిన కథానాయికల, చేగువేరా చిత్రాలు


నెహ్రూ చిత్రాన్ని గీస్తున్న అఖిల్



ఆ యువకుడు పెన్సిల్ పడితే అద్భుతాలు ప్రాణం పోసుకుంటాయి. తన మదిలో మెదిలే ఆలోచనలకు పెన్సిల్‌తో జీవం పోస్తున్నారు. పాఠశాల దశలో మొగ్గ తొడిగిన ఆసక్తితో మొదలైన చిత్రకళా ప్రయాణం నేడు ఎందరినో ఆకట్టుకుట్టుకునేలా ఎదిగింది. ముదిగొండకు చెందిన మాణిక్యం అఖిల్‌కు చిన్నప్పటి నుంచి బొమ్మలు వేయడం సరదా. ఖాళీ సమయాల్లో వివిధ ఆకృతులు గీయడం సాధన చేసేవారు. పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన ఇతను పెన్సిల్‌తో బొమ్మలు వేయడంలో పట్టు సాధించారు. ఎవరి సలహా, పర్యవేక్షణ లేకుండా నైపుణ్యం సాధించారు. పల్లె సోయగాలు, ప్రముఖుల చిత్రాలు, జాతీయ, రాజకీయ నాయకుల, సినిమా హీరో హీరోయిన్ల రూపాలు.. ఇలా ఇప్పటి వరకు 2వేలకు పైగా చిత్రాలు గీశారు. ★ ఎవరైనా తన ఎదుట కూర్చుంటే వారి రూపాన్ని అచ్చుగుద్దినట్టు గీయగలరు. అంతర్జాలంలో చూసి చిత్రకళ నేర్చుకున్నారు. ★ పాప్ ఆర్ట్, స్ట్రింగ్‌ఆర్ట్‌లో రాణిస్తున్నారు. ఇసుక, ముగ్గు, దారాల సాయంతో ఇతను వేసిన బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. ★ వివాహాలు, ఇతర వేడుకల సమయంలో ఆ కుటుంబ సభ్యులంతా కలిసి ఉన్న చిత్రాలు గీస్తూ ఆదాయాన్ని పొందుతున్నారు. పెయింటింగ్‌నూ జీవన భృతిగా మార్చుకున్నారు. ★ ఆన్‌లైన్ వేదికగా జరిగే పోటీల్లో పాల్గొని పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. 2020-24 మధ్య కాలంలో పలు వెండి పతకాలు సొంతమయ్యాయి.

పక్షి గూడు.. జొన్న కూడు



ఖాళీ కొబ్బరి బొండాన్ని పక్షి గూడుగా మలిచి, జొన్నలను ఆహారంగా ఏర్పాటు చేసిన ఓ పక్షి ప్రేమికుడి ఆలోచనను పురవాసులు మెచ్చుకుంటున్నారు. కొత్తగూడెం రైటర్ బస్తీలోని సబ్‌స్టేషన్ వద్ద మొక్కల రాజశేఖర్ ఏర్పాటు చేసిన ఈ పక్షి గూడు అటుగా వెళ్లేవారిని ఆకట్టుకుంటోంది.

– కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

జబ్బుల దెబ్బకు కుంగిన జీవితాలు..


నాగమ్మకు అన్నం తినిపిస్తున్న నాగేశ్వరరావు, పక్కన కుమారుడు వెంకటేశ్వర్లు


మిరప చేలో కూలిపని చేస్తున్న నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు

రెక్కాడితేకానీ డొక్కాడని నిరుపేద కుటుంబం వారిది. రోజువారీ కూలీ పనులకు వెళ్తే తప్ప బతుకు బండి నడపలేని పరిస్థితి. అయినా ఉన్నంతలో సంతోషంగా జీవిస్తున్న ఆ కుటుంబాన్ని అనారోగ్య సమస్యలు కోలుకోలేని దెబ్బతీశాయి. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం ముత్తారం గ్రామానికి చెందిన ఎల్.నాగేశ్వరరావు, నాగమ్మ దంపతుల కుమారుడు వెంకటేశ్వర్లు. పుట్టుకతోనే దివ్యాంగుడు. పదో తరగతి వరకు చదువుకున్న అతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. నాగమ్మ ఏడేళ్ల క్రితం పక్షవాతం బారినపడటంతో చికిత్స కోసం రూ.2లక్షలు ఖర్చు చేశారు. అయినా కోలుకోని ఆమె మంచానికే పరిమితమైంది. దెబ్బమీద దెబ్బలా రెండేళ్ల క్రితం వెంకటేశ్వర్లు భార్య నాగమణికి క్యాన్సర్ సోకటంతో ఆసుపత్రుల చుట్టూ తిప్పారు. వైద్య ఖర్చుల కోసం రూ.4లక్షలు ఖర్చు చేశారు. ఎన్ని వ్యయప్రయాలకోర్చినా ఫలితం లేకపోయింది. ఆరు నెలలు క్రితం నాగమణి మరణించింది. మంచానికే పరిమితమైన నాగమ్మకు భర్త, కుమారుడే సపర్యలు చేస్తున్నారు. దివ్యాంగుడైన వెంకటేశ్వర్లు పిల్లల బాగోగులు చూసుకోవటంతోపాటు కూలీపనికి వెళ్తున్నాడు. తండ్రి వృద్ధాప్య బారినపడటంతో నిత్యం పనికి వెళ్లలేకపోతున్నాడని, తల్లి మందులకు రూ.4 వేలు ఖర్చవుతున్నాయని వాపోతున్నారు. తనకు వచ్చే పింఛన్‌తోపాటు కూలీపనులకు వెళితే వచ్చే సంపాదనతో కుటుంబం గడుస్తోందని తెలిపారు. తండ్రికి పింఛన్ మంజూరు చేయటంతోపాటు దివ్యాంగుడైన తనకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వేడుకుంటున్నారు.

– ఈనాడు, ఖమ్మం, న్యూస్‌టుడే, ముదిగొండ

పాఠశాల క్రీడా జట్లు సిద్ధం

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడల్లో పాల్గొనే ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్లను ఆదివారం ఖమ్మం పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. జిల్లా జట్లకు ఎంపికైన వారి వివరాలను కార్యదర్శి నర్సింహమూర్తి ప్రకటించారు. అండర్-17 బాలుర జట్టులో జయంతు, సూర్య, తమన్, చరణ్, గౌతమ్, జాన్, సాయి కౌశిక్, సాత్విక్, హతీష్, గౌస్, అస్లం, విఘ్నేష్ ఉన్నారు. బాలికల జట్టులో రిమ్‌షా, అఖిల, జ్యోతిష, హనోయ్, ఆయిషని, శీతల్, చందన, కారుణ్య, చరిత, దీక్షిత, రష్మి, దర్శిని ఉన్నారు. అండర్-14 బాలుర బాస్కెట్‌బాల్ జట్టులో ఆబిద్, వినయ్, సిద్దు, చేతన్, అయాన్, స్నేహిత్, ఖాదర్, హర్షవర్ధన్, వెంకటచైతన్య, చరణ్‌సాయి, లోహిత్ ఉన్నారు. బాలికల జట్టులో అవంతిక, కీర్తి స్వప్నిక, ఉపేక్ష, అఫ్రీన్, రమ్యశ్రీ, జీవనశ్రీ, అర్థయ, దీక్షిత, కార్తీక, తన్మయ ఉన్నారు. చెస్ అండర్-14 జట్టులో రామ్ నచికత్, బి.గౌతమ్, ఎస్.గౌతమ్, ప్రత్యూష్‌కుమార్, నిహాల్ కార్తికేయన్, హిమశ్రీనిక, లక్ష్మీ సహస్ర, మహాలక్ష్మి, షణ్ముఖశ్రీ, హర్షిత ఉన్నారు. అండర్-17 జట్టులో సత్యప్రణవ్, రుత్విక్ సిద్దు, సాయి విఘ్నేష్, కార్తిక్, సుధా, వర్షిత, శ్రీకళ, పల్లవి ఉన్నారు. అండర్-17 ఖోఖో జట్టులో సాయి సిద్దార్థ, మహేంద్ర, ప్రవీణ్‌కుమార్, యువన్‌తేజ్, అభిలాష్, చంద్ర, జావిద్, గణేష్, సాయి చరణ్, ధనుష్‌సాయి ఉన్నారు. బాలికల జట్టులో చైతన్య, దుర్గాభవాని, మహాలక్ష్మి, భవానీ, మాధురి, భార్గవి, అనీష, అనూష, ఇందు, సాయి, అఖిల, రమాదేవి, తేజశ్రీ ఉన్నారు.

వైద్య విద్యార్థికి చేయూత

ఈనాడు కథనానికి స్పందన

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: 'దాతలు స్పందిస్తే.. ఆ ఊరిలో తొలి వైద్యుడు' శీర్షికన మూడు రోజుల క్రితం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి మానవతావాదులు స్పందిస్తున్నారు. ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన సుర్థేపల్లికి చెందిన శ్రీపతి చదువుల కోసం ఖమ్మానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు దండ్యాల సుబ్బారావు రూ.13 వేల చెక్కును ఆదివారం అందించారు. సుంకర ఫణికుమార్ రూ.20 వేలను ఫోన్‌పే ద్వారా పంపారు. 'ఈనాడు'కు, దాతలకు విద్యార్థి శ్రీపతి ధన్యవాదాలు తెలిపారు.

సత్తుపల్లి, న్యూస్‌టుడే: వైద్య విద్యార్థిని రాజిని శివభార్గవికి లయన్స్ క్లబ్ బాధ్యులు చేయూత అందించారు. స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సదరు విద్యార్థినికి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పెనుగొండ రమేశ్, ఉమామహేశ్వరరెడ్డి, గోగడ రవిలు రూ.32 వేలు సాయం చేశారు. సత్తుపల్లిలోని ప్రకాశం పంతులు వీధికి చెందిన సీతయ్య రూ.5వేలు అందజేశారు. కార్యక్రమాల్లో దారా కృష్ణారావు, సోమిరెడ్డి, లింగారెడ్డి, సీహెచ్ అప్పారావు, దొడ్డా కృష్ణయ్య, కొత్తూర రాజా, మాధురి మధు, పెద్దరాజు పాల్గొన్నారు.

అలరించిన 'నెలనెలా వెన్నెల'


హాలికులు సేమమా..? నాటికలో ఓ సన్నివేశం

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన 'నెలనెలా.. వెన్నెల' వీక్షకులను అలరించింది. అతిథులుగా నిర్మల్ హృదయ్ పాఠశాల కరస్పాండెంట్ వంగా సాంబశివారెడ్డి, బొమ్మా విద్యా సంస్థల ఛైర్మన్ బొమ్మా రాజేశ్వరరావు, సీఐటీయూ జిల్లా నాయకుడు వై.విక్రమ్ హాజరై మాట్లాడారు. 'హాలికులు సేమమా..?' నాటిక ఆలోచింపజేసింది. అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, అన్నాబత్తుల సుబ్రహ్మణ్య కుమార్, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు నాగబత్తిని రవి, వేల్పుల విజేత, నామా లక్ష్మీనారాయణ, వేముల సదానందం, కళాకారులు పాల్గొన్నారు.

ఆనందకరం.. రాములోరి అభిషేకం


దర్శించుకుంటున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయ పరిసరాలు ఆదివారం భక్తులతో సందడిగా మారాయి. మూలవిరాట్‌కు సుప్రభాతం పలికి ఆరాధించి నామార్చన చేశారు. అభిషేక మహోత్సవం, బంగారు పుష్పార్చన అలరించాయి. నిత్యకల్యాణం, తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఎస్పీ రోహిత్‌రాజ్ కుటుంబ సమేతంగా రాములవారిని దర్శించుకున్నారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని మమత ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ పువ్వాడ జయశ్రీ పేర్కొన్నారు. మమత ఆస్పత్రిలో రెండు రోజుల పాటు నిర్వహించిన టీఎస్ ఎపికాన్ జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. ఆధునిక కాలంలో కొత్త జబ్బులు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. అంతే వేగంగా ఔషధాలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ఖమ్మం సదస్సు అనేక ఆవిష్కరణలకు వేదికగా నిలిచిందన్నారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. సదస్సులో 60 మంది ప్రతినిధులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. మూడు సెమినార్లకు వెయ్యిమంది పీజీ వైద్యులు హాజరయ్యారని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫిజీషియన్ రాష్ట్ర అసోసియేషన్ ఛైర్మన్ రమేశ్, నిర్వహణ కమిటీ బాధ్యులు కన్నెగంటి శివరామకృష్ణ, కె.శ్రీకాంత్, అనుదీప్ పాల్గొన్నారు.


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న పువ్వాడ జయశ్రీ, హాజరైన ప్రతినిధులు

నవంబరు 3న 'సకల ఉద్యోగుల వన సమారాధన'


మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు, కస్తాల సత్యనారాయణ, రవీంద్ర ప్రసాద్, సైదులు, శ్రీనివాస్

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: నవంబరు 3న ఖమ్మంలో సకల ఉద్యోగుల కుటుంబాలతో కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు ఉద్యోగ ఐకాస(ఐక్య కార్యాచరణ సమితి) రాష్ట్ర సెక్రటరీ జనరల్, టీజీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. అటెండర్ నుంచి జిల్లా అధికారి వరకు పాల్గొనాలని కోరారు. ఖమ్మంలోని టీఎన్జీఓ భవన్‌లో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఖమ్మంలో నివాసముంటున్న భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు చెందిన పలువురు ఉద్యోగులను సైతం ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని సుమారు 75కు పైగా రాష్ట్ర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు రేణుకా చౌదరి, రామసహాయం రఘురాంరెడ్డి సహా ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లను సత్కరించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఐకాస జిల్లా నాయకులు కస్తాల సత్యనారాయణ, మల్లెల రవీంద్ర ప్రసాద్, కొణిదెన శ్రీనివాసరావు, గుంటుపల్లి శ్రీనివాసరావు, ఎస్‌టీఎఫ్ సైదులు, కల్యాణం కృష్ణయ్య, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య


నరసమ్మ


నిందితులు భూక్య ప్రసాద్, నెల్లూరి మల్లేశ్వరి

కల్లూరు, న్యూస్‌టుడే: తనతో కాపురం చేయాలంటూ ఒత్తిడి చేస్తున్న రెండో భార్యను, మూడో భార్య సాయంతో ఓ వ్యక్తి దారుణంగా హతమార్చిన ఘటన కల్లూరులో వెలుగుచూసింది. ఈ నెల 15న కల్లూరు పరిధిలో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన విషయం విదితమే. ఈ కేసును పోలీసులు ఛేదించి నిందితులను రిమాండ్‌కు పంపారు. ఇందుకు సంబంధించిన వివరాలను కల్లూరు ఏసీపీ ఎ.రఘు ఆదివారం స్థానిక ఠాణాలో వెల్లడించారు. కల్లూరు మండలం లక్ష్మీపురానికి చెందిన భూక్య ప్రసాద్ ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. తల్లాడ మండలం పాయపూర్‌కు చెందిన కల్యాణితో 20 ఏళ్ల క్రితం వివాహం కాగా మధ్యలోనే ఆమెను వదిలేశాడు. ఆ తర్వాత భద్రాద్రి జిల్లా కొత్తగూడేనికి పనినిమిత్తం వెళ్లిన ప్రసాద్ అక్కడ నారాయణపురం నరసమ్మ(39)ను రెండో పెళ్లి చేసుకుని లక్ష్మీపురంలో కాపురం పెట్టాడు. ఏడాది నుంచి నరసమ్మతో సఖ్యత కొరవడింది. ఈ నేపథ్యంలో ఏపీలోని నెల్లూరు జిల్లా చల్లాయిపాలెంకు కరెంటు పనికి వెళ్లాడు. అక్కడ నెల్లూరి మల్లేశ్వరితో సన్నిహితంగా ఉంటూ ఆమెను మూడో పెళ్లి చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న నరసమ్మ స్టేషన్‌లో ప్రసాద్ తీరుపై ఫిర్యాదు చేసింది. కాపురానికి రావాలని పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టింది. దీంతో ఆమెపై కోపం పెంచుకున్న ప్రసాద్ నరసమ్మను హతమార్చాలని పథకం రచించాడు. 'ఇద్దరం కలిసి ఉందాం, గొడవలు వద్దు మాట్లాడుకుందామ'ని నమ్మించి కొద్ది రోజుల క్రితం కల్లూరు శివారులోని పోట్రు కృష్ణయ్య మామిడి తోటకు పిలిపించాడు. అక్కడ ఆమెతో గొడవపడి తలభాగంలో చేతితో దాడి చేశాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన తర్వాత మల్లేశ్వరి సాయంతో నరసమ్మ మెడకు చీరను బిగించి హతమార్చారు. తర్వాత మృతదేహాన్ని పుల్లపుకుంటలో పడేసి వెళ్లిపోయారు. ఈ ఘటనపై విచారణ చేసిన పోలీసులు హత్యకు పాల్పడిన ప్రసాద్, మల్లేశ్వరిలను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. కేసును ఛేదించడంలో కృషి చేసిన సిబ్బంది పరుచూరి రమేశ్, చెన్నూరి అశోక్, సోమవరకు శ్రీనివాసరావులను అభినందించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. సత్తుపల్లి గ్రామీణ సీఐ ముత్తు లింగయ్య, కల్లూరు ఎస్ఐ షాకీర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీబీఐ దర్యాప్తు చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల ఐకాస జాతీయ అధ్యక్షుడు చందా లింగయ్యదొర

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరులోని చిక్కుడుగుంట వద్ద నిర్మించిన బీటీపీఎస్‌లో రూ.400 కోట్ల కుంభకోణం జరిగిందని, వెంటనే సీబీఐ దర్యాప్తు చేపట్టాలని ఆదివాసీ సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు చందా లింగయ్య దొర డిమాండ్ చేశారు. ఆదివారం బీటీపీఎస్ సమీపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీటీపీఎస్ నిర్మాణంలో భాగంగా కేసీఆర్ ప్రభుత్వం ఆదివాసీలకు చెందిన భూములను లాక్కొని మొండిచేయి చూపిందన్నారు. భూములు కోల్పోయిన ఆదివాసీలకు నష్టపరిహారం, ప్రత్యేక ప్యాకేజీలు చట్ట ప్రకారం చెల్లించలేదన్నారు. భూమికి బదులు భూమి ఇస్తామని మాయమాటలు చెప్పి పదేళ్లపాటు కాలం వెళ్లదీశారన్నారు. భూసేకరణ కోసం కేటాయించిన డబ్బులను కొంతమంది దళారులు అధికారులతో కుమ్మక్కై రెవెన్యూ రికార్డులు మార్చి ఆదివాసీల సొమ్మును కాజేశారని, ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా ఆదివాసీలకు ఎటువంటి న్యాయం చేయలేదన్నారు. ఈ విషయంపై అతిత్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సీబీఐ లేదా సీబీసీఐడీ దర్యాప్తు చేపట్టాలని కోరుతామన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ నాయకులు, భూనిర్వాసితులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి కూలీ మృతి

కూసుమంచి, న్యూస్‌టుడే: నాయకన్‌గూడేనికి చెందిన కిన్నెర శ్రీను(40) అనే వ్యక్తి ఆదివారం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. కూలీ పనులతో కుటుంబాన్ని పోషించే శ్రీను వంటకలప కోసం వెళ్లిన క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. విద్యుత్తు తీగను తాకి విద్యుదాఘాతంతో బావిలో పడి ఉంటాడని భావిస్తున్నారు. శ్రీను భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కూసుమంచి ఎస్ఐ నాగరాజు తెలిపారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

పోలీసు బలగం అమరులకు సలాం



ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే

పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం శ్రమిస్తుంటారు. విద్రోహ చర్యలు, మావోయిస్టు దాడుల్లో అమరులైన పోలీసుల సేవలను గుర్తు చేసుకునేందుకు ఏటా 'పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం' నిర్వహిస్తుంటారు. నేటి నుంచి నెలాఖరు వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు ఉండనున్నాయి.

ఏమిటీ దినోత్సవం

ఈ దినం వెనుక ఓ విషాద సంఘటన ఉంది. 1959 అక్టోబరు 21న కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు(సీఆర్‌పీఎఫ్) భారత్-చైనా సరిహద్దుల్లో రక్షణ విధుల్లో ఉన్నాయి. డీఎస్పీ కరమ్‌సింగ్ నేతృత్వంలో పంజాబ్‌కు చెందిన 21 మంది బృందం గస్తీలో ఉంది. చైనా రక్షణ బలగాలు సియాచిన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో వీరు అడ్డుకున్నారు. వేడి నీటి బుగ్గ(హాట్ స్ప్రింగ్స్) ప్రాంతంలో జరిగిన వీరోచిత పోరాటంలో పది మంది భారత జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. వారి త్యాగానికి గుర్తుగా పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని జరుపుతున్నారు.

నెలాఖరు వరకు.. కార్యక్రమాలు

ఖమ్మం పోలీసు కమిషనరేట్ పరిధిలో అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపనున్నారు. 31న జరిగే సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఖమ్మం సీపీ సునీల్‌దత్ తెలిపారు. ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించి పోలీసు విధులు, త్యాగాలు, సాంకేతిక వినియోగం, ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, స్నేహ పూర్వక పోలీసు వ్యవస్థ వంటి విషయాలను వివరించనున్నారు. సైకిల్ ర్యాలీ, మెగా రక్తదాన శిబిరాలు వంటి కార్యక్రమాలు చేపడతారు.

ఉమ్మడి జిల్లాలో 22 మంది..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 22 మంది పోలీసులు అమరులయ్యారు. విద్రోహ, నక్సలైట్ల దాడుల్లో మృతి చెందిన పోలీసు సిబ్బందిని అమరవీరులుగా గుర్తిస్తారు. ఏ జిల్లాలో నియమితులైన వారిని ఆ జిల్లాకు చెందిన వారిగా పరిగణిస్తారు.

ప్రధాన సంఘటనలు

★ 1992 సెప్టెంబరు 4న రాళ్లవాగు వద్ద ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాల నగదు తీసుకెళ్తున్న వ్యానుకు రక్షణగా వెళ్తున్న పోలీసు వాహనాన్ని నక్సలైట్లు పేల్చివేశారు. ఈ ఘటనలో 10 మంది పోలీసు సిబ్బంది మృతి చెందారు. ★ 1992 అక్టోబరు 27న మోతుగూడెం దగ్గర డొంకరాయి రోడ్డుపై తునికాకు లారీ నక్సలైట్లు తగులబెట్టారు. విద్యుత్తు సామగ్రి తీసుకువస్తున్న లారీలో వస్తున్న పోలీసు సిబ్బంది సింధువాడ వద్ద నక్సలైట్లు ల్యాండ్‌మైన్ పేల్చడంతోపాటు, జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక ఎస్ఐ సహా నలుగురు పోలీసులు అమరులయ్యారు. ★ 1997 జనవరిలో కరకగూడెం పోలీసు స్టేషన్‌పై నక్సలైట్లు దాడి చేయగా ఎనిమిది మంది పోలీసులు, ఎనిమిది మంది ఏపీఎస్పీ బెటాలియన్ పోలీసులు అమరులయ్యారు.

స్మారక స్తూపం

1997లో ఖమ్మం జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో పూర్తిగా గ్రానైట్ రాయితో పోలీసు అమరవీరుల స్మారక స్తూపాన్ని నిర్మించారు. ఇక్కడ పోలీసు అధికారులు, సిబ్బంది నివాళులర్పించడం ఆనవాయితీ.

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర • వైరా

పలువురికి మంత్రి తుమ్మల పరామర్శ


గాదె సత్యంను పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గాదె సత్యంను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. స్థానిక కాకర్లపల్లి రోడ్డులో నివాసం ఉంటున్న సత్యం వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. గుడిపాడు రోడ్డుకు చెందిన చీకటి ధర్మయ్య ఇటీవల మృతి చెందగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. డాక్టర్ మట్టా దయానంద్, చల్లగుళ్ల నరసింహారావు, కొల్లి వెంకటేశ్వరరావు, కిలారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫారెస్టు డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రామ్‌సింగ్



కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు డీఆర్వో జి.రామ్‌సింగ్ సత్తుపల్లి డివిజన్ తెలంగాణ జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమితులయ్యారు. రామ్‌సింగ్ మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులకు తన వంతు సహకారం అందిస్తానన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

సమస్య: అంజనాపురంలో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. ట్రాక్టర్ రాకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడనే ఉంటుంది.
- నాగేశ్వరరావు, స్థానికుడు

సమాధానం: గ్రామంలో చెత్త సేకరణ ట్రాక్టర్ తిరిగేలా చర్యలు తీసుకుంటాం.
- రాజేశ్వరి, ఎంపీఓ – కొణిజర్ల, న్యూస్‌టుడే

✆ పెనుబల్లి బీసీ కాలనీ సమీపంలోని జర్నలిస్ట్ కాలనీలో డ్రైనేజీ పూడిపోయి ఇళ్లలో వాడుకున్న నీరు రోడ్డుపై చేరుతోంది.
- నూర్జహాన్, బీసీ కాలనీ, పెనుబల్లి:

✔ పంచాయతీ సిబ్బంది సహకారంతో సమస్య పరిష్కరిస్తాం. **- ముస్తాఫా, కార్యదర్శి, పెనుబల్లి: – పెనుబల్లి, న్యూస్‌టుడే**

స్పందనకు పందనం

మధిర పట్టణంలోని వినాయకుడి గుడి దగ్గర డ్రైనేజీ తీయకపోవటంతో మురుగు నీరు నిల్వ ఉండి భక్తులకు అసౌకర్యం కలుగుతుందని ఈ నెల 18న 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ప్రచురితమైంది. మున్సిపల్ సిబ్బంది ఆదివారం కాల్వను శుభ్రం చేశారు.
– మధిర గ్రామీణం, న్యూస్‌టుడే

✦ వందనం బొడ్రాయి సెంటర్‌లోని ప్రధాన రహదారిపై నిలుస్తున్న వర్షపు నీటిని గాడికొట్టి తొలగించారు. ప్రజల ఇబ్బందులపై శ్రీనివాసరావు 'మేమున్నాం.. మీకు తోడుగా.' దృష్టికి తీసుకొని రాగా స్పందించిన ఎంపీడీఓ రామయ్య పంచాయతీ కార్మికుల సాయంతో మురుగు నీటిని ఆదివారం తొలగించారు. – చింతకాని, న్యూస్‌టుడే

రూ.100 కోట్లతో పుర అభివృద్ధి

వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్


సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, బొర్రా, జైపాల్

వైరా, న్యూస్‌టుడే: రూ.100 కోట్లతో వైరా పురపాలకాన్ని అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రకటించారు. వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం రాత్రి పురపాలక అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైరా పర్యటనకు వచ్చిన సమయంలో చేసిన విజ్ఞప్తి మేరకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు పంపించాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వైరా పురపాలకానికి అధికారికంగా వచ్చిన సమాచారం మేరకు సమీక్ష నిర్వహించారు. 20 వార్డుల ప్రతినిధులు, ఇతర శాఖల అధికారులతో సమీక్ష చేపట్టారు. ఏఏ పనులు అత్యవసరంగా చేపట్టాలనే అంశంపై చర్చించారు. వైరా నుంచి సోమవరం, పల్లిపాడు, కేవీకే వరకు సెంట్రల్ లైటింగ్, డంపింగ్ యార్డు అభివృద్ధి, ఇందిరమ్మ కాలనీ నుంచి గండగలపాడు ఆలయం వరకు రోడ్డు నిర్మాణం, సత్రంబజారు అభివృద్ధి, డ్రైనేజీ, దుద్దెపుడి రోడ్డు విస్తరణ, రాజశేఖర్‌నగర్ నుంచి తల్లాడ రోడ్డుకు ప్రత్యేక రహదారి, క్రాస్ రోడ్డు రింగు, ఫౌంటేన్, జలాశయం సుందరీకరణ, కూరగాయల మార్కెటు రోడ్డు విస్తరణ, షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణం తదితరాలపై చర్చించారు. పుర ఛైర్మన్ సూతకాని జైపాల్, మార్క్‌ఫెడ్ మాజీ ఉపాధ్యక్షుడు బొర్రా రాజశేఖర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, పురపాలక కమిషనర్ చింతా వేణు, అధికారులు పాల్గొన్నారు.

ఇంతి.. ఉపాధి కాంతి

స్వశక్తితో మరో ముగ్గురు మహిళలకు ఉపాధి

ముదిగొండ, న్యూస్‌టుడే

కష్టపడే తత్వం, జీవితంలో ఎదగాలనే సంకల్పం ఉంటే ఏ పనిలోనైనా విజయం వరిస్తుంది. ఇందుకు నిదర్శనమే ముదిగొండ మండలం వనంవారికిష్టాపురానికి చెందిన చాగంటి లావణ్య. స్వయం ఉపాధి వైపు అడుగులు వేసి కుటుంబానికి బాసటగా నిలవటంతోపాటు మరో ముగ్గురు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారామె.

స్వయం ఉపాధితో రాణించాలని భావించిన లావణ్య ఆరేళ్ల క్రితం జనపనార (జ్యూట్) బ్యాగుల తయారీపై శిక్షణ తీసుకున్నారు. తయారీలో మెలకువలు తెలిశాక బ్యాంకు, ఎస్‌హెచ్‌జీ నుంచి రుణం తీసుకుని రూ.5లక్షలతో జ్యూట్ బ్యాగుల తయారీ యూనిట్ ఏర్పాటు చేశారు. చేతిసంచులు, భోజనం తీసుకెళ్లే, ఇతర రకాల బ్యాగులు ఇలా జనపనారతో 60రకాల డిజైన్లతో సంచులు తయారు చేస్తున్నారు. భర్త నాగేశ్వరరావు సహకారంతో ఏలూరు, కోల్‌కతా నుంచి సంచుల తయారీకి అవసరమైన సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. వివాహాలు, శుభకార్యాల సమయంలో ఆర్డర్లు ఇచ్చిమరీ ఈమె తయారు చేసిన సంచులను కొనుగోలు చేస్తున్నారు. రూ.100 నుంచి రూ.300 విలువ చేసే నెలకు 600 సంచులు తయారు చేస్తున్నారు. ఈ క్రమంలో తనతోపాటు మరో ముగ్గురు మహిళలకు ఉపాధి చూపిస్తున్నారు. వారికి నెలకు రూ.9వేల వేతనం ఇస్తున్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు సంచుల తయారీలో నిమగ్నమవుతున్నారు.

స్టాల్స్‌లో బ్యాగుల విక్రయం

ప్రభుత్వం, డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే స్టాల్స్‌తోపాటు ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసే ప్రదేశాల్లో లావణ్య స్టాల్ ఏర్పాటు చేసి బ్యాగులు విక్రయిస్తున్నారు. ఖమ్మం, హైదరాబాద్, భువనేశ్వర్, సూరత్ వంటి నగరాల్లో ప్రత్యేక కార్యక్రమాల సమయంలో స్టాల్‌ను ఏర్పాటు చేసి విక్రయాలు చేపడుతున్నారు.


జ్యూట్ బ్యాగులు తయారు చేస్తున్న లావణ్య, మహిళలు

చిరుధాన్యాలతో స్నాక్స్

ప్రస్తుత మార్కెట్‌లో చిరుధాన్యాలకు డిమాండ్ ఉంది. ప్రజాభిరుచిని గ్రహించిన లావణ్య చిరుధాన్యాలతో స్నాక్స్ తయారీకి శ్రీకారం చుట్టారు. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, సామలు, అరికలు, ఊదలు, అండుకొర్రలు వంటి 12రకాల చిరుధాన్యాలతో స్నాక్స్ తయారు చేస్తున్నారు. అహ్మదాబాద్‌లో రూ.90 వేలతో కుర్‌కురే తయారీ యంత్రాన్ని కొనుగోలు చేశారు. 60 గ్రాములున్న స్నాక్స్ ప్యాకెట్‌ను రూ.30కు విక్రయిస్తున్నారు. బ్యాంకు రుణాలతోపాటు మహిళలకు వేతనాలు చెల్లింపులు పోగా నెలకు రూ.60వేలు ఆదాయం వస్తోందని లావణ్య తెలిపారు.


స్నాక్స్ స్టాల్ వద్ద లావణ్య

పిడుగుపాటుతో గాయాలు

బోనకల్లు, న్యూస్‌టుడే: పిడుగుపాటుతో ఓ రైతుకు గాయాలైన ఘటన ఆదివారం బ్రాహ్మణపల్లిలో చోటుచేసుకుంది. మడుపల్లి నాగేశ్వరరావు తన పొలంలో కూలీలతో పత్తి తీయిస్తుండగా ఉరుములు మెరుపులతో సమీపంలో పిడుగు పడింది. నాగేశ్వరరావు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మం తరలించారు.

ఉలికిపాటు


చెట్టుకు వ్యాపించిన మంటలు

వైరా, న్యూస్‌టుడే: వైరాతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. నారపునేనిపల్లిలో శీలం శేఖర్ రెడ్డి ఇంటి ఆవరణలో కొబ్బరిచెట్టుపై పిడుగుపాటు పడటంతో మంటలు వ్యాపించాయి. ఇంట్లో ఎవరూ లేకపోవటంతో ప్రాణాపాయం సంభవించలేదు.

అకాల వర్షానికి నేలవాలిన వరి

మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల ప్రభావానికి వరిపంట నేలవాలుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లింగాల, ఎర్రబోయనపల్లి, పుల్లయ్య బంజర, ముచ్చవరం, కల్లూరు శివారు కప్పలబంధం రోడ్డు తదితర ప్రాంతాల్లో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఏఓ రూప మాట్లాడుతూ సుమారు 150 ఎకరాల వరి పైరు నేలవాలినట్టు ఉన్నతాధికారులకు నివేదించినట్టు తెలిపారు. – కల్లూరు, న్యూస్‌టుడే



బస్సులు ఇలా నిలిపితే ఎలా?



ఏన్కూరు కూడలిలో నడిరోడ్డుపై బస్సులు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించడం చేయడంతో వెనక నుంచి వచ్చే వాహనదారులు ముందుకు వెళ్లలేకపోతున్నారు. బస్సులు నిలిపేందుకు రహదారి పక్కన స్థలం లేకుండా దుకాణదారులు ముందుకు రావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కూడలిలోనే డివైడర్లు ప్రారంభం కావడంతో రెండో వాహనం వెళ్లేందుకు వీలు లేకుండా మారింది. ఈ విషయమై ర.భ.శాఖ ఏఈ ప్రవీణ్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' ప్రశ్నించగా.. బస్సులు నిలిపేందుకు స్థలం కేటాయించి సమస్య పరిష్కస్తామని తెలిపారు. – ఏన్కూరు, న్యూస్‌టుడే

శుద్ధ జలం కాదు.. సుద్ద జలం



పాకలగూడెం పంచాయతీ సత్యనారాయణపురంలో పంచాయతీ బోరు నుంచి మురికి నీరు వస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సుద్ద రంగులో నీరు వస్తుండటంతో తాగేందుకు, వినియోగానికి పనికిరావటం లేదు. దీంతో తాగునీటి కోసం పామాయిల్ తోటలో ఉన్న బోరు వద్దకు వెళ్తున్నారు. కొందరు నాలుగు కి.మీ. దూరంలో ఉన్న గంగారానికి, సరిహద్దులో ఏపీలోని చింతపల్లికి శుద్ధజలం కోసం పరుగులు పెడుతున్నారు. ఇన్‌ఛార్జ్ సెక్రటరీ జి.షీలారాణి మాట్లాడుతూ ట్యాంక్ శిథిలావస్థకు చేరి లోపలి భాగం నుంచి పెచ్చులూడుతుండటంతో సుద్ద నీరు వస్తుందని, ఈ విషయాన్ని ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ప్రత్యామ్నాయం ఏర్పాటు చేస్తామన్నారు. – సత్తుపల్లి, న్యూస్‌టుడే

డీఏ బకాయిలు విడుదల చేయాలి: యూటీఎఫ్

తల్లాడ, న్యూస్‌టుడే: పెండింగ్ డీఏలు విడుదల చేయటంతోపాటు, పీఆర్సీ వెంటనే అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు అన్నారు. ఆదివారం ఖమ్మంలోని యూటీఎఫ్ భవన్‌లో తల్లాడ యూటీఎఫ్ 11వ మహాసభ నిర్వహించారు. సభలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, షేక్ రంజాన్ మాట్లాడుతూ రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని కోరారు. సంఘం మండల అధ్యక్షునిగా షేక్ లాల్‌సయ్యద్, కార్యదర్శిగా శ్రీనివాసరావును ఎన్నుకున్నారు.

తరగతి గదిలోనే భవిష్యత్తు: ఎస్సై

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదుల్లోనే తీర్చిదిద్దబడుతుందని గ్రామీణ ఎస్సై లక్ష్మీభార్గవి అన్నారు. పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఆదివారం గ్రామస్థులు సన్మానించారు.


సన్మానం పొందిన ఉపాధ్యాయులతో అధికారులు, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులు ఊట్ల శంకర్‌రావు, రాధాకృష్ణ, మల్లేల శ్రీనివాసరావు, కళావతి, సుజాతలను సన్మానించారు. మాజీ సర్పంచి నిడమానూరు సంధ్య, ప్రధానోపాధ్యాయులు ప్రమీల, విశ్రాంత ఉపాధ్యాయులు రావిరాల లక్ష్మణ్‌రావు, కాంగ్రెస్ నాయకులు నిడమానూరు వంశీకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఐద్వా సభలపై ప్రచారం

వైరా, న్యూస్‌టుడే: కొత్తగూడెంలో ఈ నెల 21నుంచి జరగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ వైరాలో ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో సంఘం నాయకులు గుడిమెట్ల రజిత, బత్తుల ప్రమీల, చావా కళావతి, అమృతమ్మ, కృష్ణకుమారి, వెంకటరమణ పాల్గొన్నారు.

సమన్వయకర్తగా పూర్ణచంద్రరావు



సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంతీయ అధ్యయన కేంద్రం సమన్వయకర్తగా ఆ కళాశాలకు చెందిన అధ్యాపకుడు డాక్టర్ చీపు పూర్ణచంద్రరావు నియమితులయ్యారు.

కోటమైసమ్మ ఆలయంలో పూజలు

కారేపల్లి, న్యూస్‌టుడే: ఉసిరికాయలపల్లి శ్రీకోటమైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాగా జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీలలోని కానుకలను రెండో దఫా ఈనెల 21న లెక్కించనున్నారు.

మంగాపురంలో సామాజిక భవనం ప్రారంభం


స్థలదాతలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

తల్లాడ, న్యూస్‌టుడే: మంగాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆదివారం రాత్రి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. భవనాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్మాణానికి స్థలాన్ని అందించిన దాతలను ఎమ్మెల్యే రాగమయి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాపా సుధాకర్, దగ్గుల రఘుపతిరెడ్డి, రాయల రాము, దుండేటి వీరారెడ్డి, ఆడపా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్న సంతర్పణ

మధిర, న్యూస్‌టుడే: ఆర్వీ గురుస్వామి సిండికేట్ ఆధ్వర్యంలో అయ్యప్ప, భవానీ, హనుమాన్ మాలధారులకు ఆదివారం అన్న సంతర్పణ(భిక్ష)ను ప్రారంభించారు. ఏటా ఆర్వీ గురుస్వామి ఆధ్వర్యంలో దాతల సాయంతో 41 రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. స్థానిక సాయిబాబా గుడి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మొదటి రోజు నలమల అమర్‌నాథ్ ఆర్థిక సాయంతో భిక్ష ఏర్పాటు చేశారు.


అయ్యప్పస్వామి చిత్రపటానికి పూజలు చేస్తున్న భక్తులు

అట్లతద్దె.. ఆనంద హేల


ఊయల ఆటలో పాల్గొన్న మహిళలు

కారేపల్లి, న్యూస్‌టుడే: విశ్వనాథపల్లిలో అట్లతద్దె వేడుకను ఆదివారం మహిళలు ఘనంగా జరిపారు. మహిళలంతా ఒకచోట చేరి సాముహికంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చెట్లకు కట్టిన ఊయల ఆటలతో సందడిగా గడిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

కొణిజర్ల, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. కొణిజర్లలో మండల కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలు ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. భాజపా ప్రభుత్వం నిరుద్యోగులు, రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. వరదలకు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, రుణమాఫీ అందరికీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోతుకూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, మాదినేని రమేశ్, కొప్పుల కృష్ణయ్య, తాళ్లపల్లి కృష్ణ, మండల కార్యదర్శి కుటుంబరావు పాల్గొన్నారు.

'సాయిబాబా మరణం తీరని లోటు'

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సామాజిక కార్యకర్త, ప్రశ్నించే గొంతుక, ఆచార్య సాయిబాబా మరణం పౌరహక్కుల ఉద్యమానికి తీరని లోటని సత్తుపల్లి డివిజన్ ప్రైవేటు పాఠశాలల సంఘ అధ్యక్షుడు పసుపులేటి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో ఆదివారం సాయిబాబా సంస్మరణ సభను నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగులతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్వీ కుమార్, ఎల్ఎస్‌రెడ్డి, గడ్డం శ్రీనివాసరావు, నజీరుద్దీన్, దుర్గారావు, జీవీ రావు పాల్గొన్నారు.

కమలమ్మకు నివాళి

ముదిగొండ, న్యూస్‌టుడే: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు మాతృమూర్తి కమలమ్మ నాలుగో సందర్భంగా వెంకటాపురంలో ఆమె విగ్రహానికి ఆదివారం నివాళులర్పించారు. భర్త రాయల వెంకటేశ్వర్లుతోపాటు కుమారులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావులు కమలమ్మ పూలమాలలు వేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్మినేని రమేశ్‌బాబు పాల్గొన్నారు.

భారాస నాయకుల రాస్తారోకో


మీనవోలులో రాస్తారోకో చేస్తున్న నాయకులు

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: రైతు భరోసా నిధుల విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ మీనవోలు గ్రామంలోని ప్రధాన రహదారిపై భారాస మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు పంబి సాంబశివరావు, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు శీలం కవిత, నాయకులు రామకోటేశ్వరరావు, మల్లికార్జునరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారావు, శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

మధిర పట్టణంలో..: మధిర, న్యూస్‌టుడే: రైతు భరోసా ఇవ్వకుండా కాంగ్రెస్ మోసం చేస్తుందని భారాస నాయకులు విమర్శించారు. ఆదివారం పార్టీ నాయకులు స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, కటికల సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వైవీ అప్పారావు, కొప్పుల భాస్కర్‌రెడ్డి, అరిశ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బోనకల్లు, న్యూస్‌టుడే: రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ భారాస ఆధ్వర్యంలో ఆదివారం బోనకల్లులో రాస్తారోకో చేశారు. ఆందోళనలో మధిర మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు బంధం శ్రీనివాసరావు మాట్లాడారు. నాయకులు మోదుగు నాగేశ్వరరావు, కంచర్ల బాబు, చుక్కారావు, తన్నీరు పుల్లారావు పాల్గొన్నారు.

ముదిగొండ, న్యూస్‌టుడే: రైతు భరోసా నిధులు రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భారాస నాయకులు ముదిగొండలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. భారాస మండల అధ్యక్ష, కార్యదర్శులు వాచేపల్లి లక్ష్మారెడ్డి, గడ్డం వెంకట్, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, రైబస మండల మాజీ కన్వీనర్ పోట్ల వెంకటప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.


మధిర: తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట నిరసన..


బోనకల్లులో ఆందోళన చేస్తున్న భారాస కార్యకర్తలు

బోనకల్లులో అమ్మవారి శోభాయాత్ర

బోనకల్లు, న్యూస్‌టుడే: బోనకల్లులోని గిరిజన కాలనీలో ఆదివారం రాత్రి దుర్గాదేవి అమ్మవారి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రను మాజీ సర్పంచి భూక్యా సైదానాయక్‌తో కలిసి పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్‌కుమార్ ప్రారంభించారు. కళాకారుల విచిత్ర వేషాలు, డ్యాన్స్‌లు, కటౌట్లతో శకటాలు ఏర్పాటు చేశారు. రెండు రోజులు నిర్వహించిన వేడుకలు జనాన్ని ఆకట్టుకున్నాయి. రెండో రోజు పలు గ్రామాల నుంచి వర్షంలో సైతం జనం భారీగా హాజరయ్యారు. నాయకులు గాలి దుర్గారావు, బీవీ నాయక్, బండి వెంకటేశ్వర్లు, గుగులోతు రమేశ్, పిల్లలమర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


శోభాయాత్రను ప్రారంభిస్తున్న పీసీసీ సభ్యుడు కిషోర్‌కుమార్

రక్తమోడిన రహదారులు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు

వేంసూరు, న్యూస్‌టుడే: కల్లూరుగూడెం వద్ద రోడ్డు ప్రమాదంలో చిలకా గోపి(25) అనే యువకుడు మృత్యువాత పడ్డాడు. గ్రామానికి చెందిన చిలకా గోపి, రాచూరి వంశీకృష్ణలు ఓ బైక్‌పై ఆదివారం సాయంత్రం తిరువూరు వైపు వెళుతున్నారు. అదే రోడ్డుపై మోపెడ్‌పై వెళ్తున్న పెద్దబోయిన జమలయ్యను వీరి బైక్ అదుపుతప్పి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడి తలకు బలమైన గాయమైన గోపి అక్కడికక్కడే మృతిచెందాడు. బైకుపై ఉన్న రాచూరి వంశీకృష్ణ, మోపెడ్‌పై ఉన్న పెద్దబోయిన జమలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను తిరువూరు(ఎన్టీఆర్ జిల్లా) ఆసుపత్రికి తరలించారు. మృతుడు గోపికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొని..

తల్లాడ, న్యూస్‌టుడే: అంబేద్కర్‌నగర్ గ్రామంలో బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృత్యువాతపడ్డాడు. ఈ ప్రమాదం ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బిల్లుపాడు డీబీ కాలనీకి చెందిన నల్లగట్ల జయరాజు(35) బైక్‌పై పల్లిపాడుకు వెళ్తుండగా వైరా నుంచి తల్లాడ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో జయరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న అతణ్ని 108లో ఖమ్మం తరలించారు. చికిత్స పొందుతూ జయరాజు మృతి చెందాడు. తల్లాడ ఎస్సై బి.కొండలరావు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు.

దైవ దర్శనం చేసుకుని తిరిగివస్తూ...

తల్లాడ, న్యూస్‌టుడే: నరసింహారావుపేట గ్రామం వద్ద ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. భద్రాచలం వెళ్లి దైవ దర్శనం చేసుకొని తిరిగి వస్తున్న ద్విచక్ర వాహనం, తల్లాడ నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న కారు ఢీకొన్నాయి. ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వైరాకు చెందిన బత్తుల మురళీకృష్ణ, జగ్గయ్యపేటకు చెందిన బత్తుల నరసింహారావు, ఉజ్వల్ గాయపడ్డారు. వీరిని 108లో ఖమ్మం తరలించారు. మురళీకృష్ణ పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.


బత్తుల మురళీకృష్ణ

అందని పాఠ్యపుస్తకాలు

కారేపల్లి, న్యూస్‌టుడే

విద్యాసంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు అవుతున్నా ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం పుస్తకాల పంపిణీ జరగలేదు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించిన తర్వాత ఇంటికి వెళ్లి చదవాలంటే విద్యార్థులకు పుస్తకాలు అందుబాటులో లేవు. ఫలితంగా కొందరు విద్యార్థులు గైడ్లను ఆశ్రయిస్తున్నారు.

✦ ఆరు నుంచి పదో తరగతి వరకు సంబంధించిన పుస్తకాలు ఎక్కువగా రావాల్సి ఉంది. వీటిల్లో సామాన్య, సాంఘిక, లెక్కలు, బయాలజీ ఉన్నాయి.


మండల విద్యాశాఖ కార్యాలయం

మొత్తంగా ఆంగ్ల బోధనవి 556, తెలుగు మాధ్యమానికి 360 పుస్తకాలు ఉన్నాయి.

మండలంలో..	
మొత్తం పాఠశాలలు	86
అందాల్సిన పుస్తకాలు	21,874
అందిన పుస్తకాలు	20,958


ప్రతిపాదనలు పంపాం: ఎంఈవో జయరాజు

తరగతుల వారీగా మొత్తం రావాల్సిన పుస్తకాలు వివరాలు విద్యా శాఖకు పంపించాం. అధికారులకు సమాచారం అందించాం. వచ్చిన వెంటనే పంపిణీ జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

కేంద్ర మంత్రికి వినతి



ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఖమ్మం పార్లమెంట్ నియోజక వర్గంలోని ఖమ్మం స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం, మధిర మండలం జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువును పర్యాటక ప్రదేశాలుగా గుర్తించి అభివృద్ధి చేయాలని కోరుతూ కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు భాజపా నేత తాండ్ర వినోద్‌రావు దిల్లీలో శనివారం వినతి పత్రం అందించారు. భక్తులు, పర్యాటకుల కోసం విశ్రాంతి భవనాలు నిర్మించాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రారంభమైన ఉపాధి గ్రామసభలు

కామేపల్లి, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం 15వ సామాజిక తనిఖీలో భాగంగా పంచాయతీల్లో గ్రామసభలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జగన్నాథతండా పంచాయతీలో గ్రామసభను పంచాయతీ కార్యదర్శి విజయ అధ్యక్షతన నిర్వహించారు. గతేడాది నిర్వహించిన ఉపాధి పనుల్లో తనిఖీ బృందం సభ్యులు గుర్తించిన అంశాలను గ్రామసభలో చదివి వినిపించారు. ఏపీవో శ్రీరాణి, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, టీఏ భావ్‌సింగ్, క్షేత్రసహాయకుడు కృష్ణ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 80085 52623, 91541 18165
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081

✆ రమణగుట్ట దివ్యాంగుల కాలనీలో ఫాగింగ్ చేయకపోవడంతో దోమలతో ఇబ్బంది పడుతున్నాం: **ఓ పాఠకుడు**

✔ రెండు రోజుల్లో ఫాగింగ్ చేయిస్తాం: **సాంబయ్య, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

✆ వరదయ్యనగర్‌లో దోమల సమస్య అధికంగా ఉంది. మిషన్ భగీరథ పైపులు వేసినా నీటి సరఫరా కావడం లేదు: **ప్రసాదరావు**

✔ ఫాగింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటాం: **సాంబయ్య, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

✔ మిషన్ భగీరథ పైపులకు అంతర్గత కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. అది పూర్తయితే నీటి సరఫరా జరుగుతుంది: **రంజిత్, ఈఈ, ప్రజారోగ్యశాఖ**

– ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

✆ నాలుగో వార్డులో సీసీ రహదారి కంకర తేలి గుంతలమయంగా మారింది.

- దాసరి ఉదయ్, నేలకొండపల్లి

✔ ఇంజినీరింగ్ విభాగం వారితో రహదారి పరిశీలించి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపిస్తాం. **- శ్రీనివాసరావు, కార్యదర్శి**

– నేలకొండపల్లి, న్యూస్‌టుడే

పింఛనుదారుల సమస్యలు పరిష్కరించాలి

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: అపరిష్కృతంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సమస్యలను పరిష్కరించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్(ఎస్‌జీపీఏటీ) జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య డిమాండ్ చేశారు. నగరంలోని రోటరీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పింఛనుదారుల సమావేశంలో మాట్లాడారు. పింఛనుదారుల సమస్యలపై ప్రభుత్వం మొండి వైఖరి వీడి సానుకూల దృక్పథంతో ఆలోచించి పరిష్కరించాలన్నారు. కరవు భత్యం చెల్లించాలని, పీఆర్సీని విడుదల చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, ఆర్థిక కార్యదర్శి వెంకటేశ్వర్లు, శరత్ బాబు, కృష్ణకుమారి, సత్యం, అబ్దుల్ జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందక పాట్లు

కారణాలు తెలియక అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

★ ప్రకాష్‌నగర్ ఎఫ్‌సీఐ గోడౌన్ ప్రాంతానికి చెందిన పిల్లిగుండ్ల ముత్తయ్య వరదలతో సర్వం కోల్పోయారు. ఖాతా నెంబర్ తప్పుగా నమోదు కావడంతో తొలి దశలో పరిహారం జమ కాలేదు. తరువాత నెంబర్ సరి చేసుకున్నప్పటికీ సొమ్ములు మాత్రం ఖాతాలో పడలేదు.

★ సారథినగర్‌కు చెందిన కనిసెట్టి రామవరావు మున్నేటి వరదల్లో తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం ఇప్పటి వరకు అందలేదు. దీంతో నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

★ నగరంలోని వరదయ్యనగర్‌కు చెందిన కాట్రగడ్డ నాగేశ్వరరావు వరదల సమయంలో తీవ్రంగా నష్టపోయారు. పరిహారం గురించి నగరపాలక సంస్థ కార్యాలయానికి వెళ్లి విచారించగా ఖాతాలో జమైనట్లు చూపిస్తోంది. అయనకు మాత్రం రాలేదు.

– ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఇది ఏ ఒక్కరి సమస్యో కాదు. మున్నేటి వరద బాధితులు వందలాది మంది ప్రతిరోజు నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ తమకు పరిహారం అందలేదని తిరుగుతూ గోస వెళ్లబోసుకుంటున్నారు. వారి వివరాలు నమోదు చేసుకోవడం, పంపడమే తప్ప వాటిని నిరంతరం పర్యవేక్షించే సిబ్బంది లేకపోవడంతో పరిహారం అందడం లేదని బాధితులు వాపోతున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో మున్నేరు వరదల కారణంగా 9,292 కుటుంబాలు దెబ్బతిన్నాయని గుర్తించారు. వారందరికి నష్ట పరిహారం రూ.16,500 ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అందరి వివరాలు సేకరించారు. ఆన్‌లైన్ చేసే సమయంలో, వివరాలు అందించే సమయంలో నమోదులో జరిగిన తప్పిదాలు, కొంత మంది బాధితుల ఖాతాల్లో ఉన్న సాంకేతిక కారణాలతో పరిహారం జమ కాలేదు. దీంతో వాటికోసం ప్రతిరోజు



నగరపాలకంలో దరఖాస్తులు అందిస్తున్న బాధితులు

నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజావాణి కార్యక్రమంలో బాధితులు తమ గోడు వెళ్లబోసుకోవడం సర్వసాధారణంగా మారిపోయింది.

అంతుచిక్కక తికమక

ఖాతా నెంబర్లు, ఇతర వివరాలు సరి చేసి బ్యాంకులకు పంపినా అవి బాధితుల ఖాతాల్లో జమ కాకపోవడం సమస్యగా మారింది. నగరపాలక సంస్థ కార్యాలయం సిబ్బంది తాము వివరాలు బ్యాంకుకు పంపామని, బాధితులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంటున్నారు.

శుద్ధజలం వృథా!

భాసిత్‌నగర్ ఎస్సీ కాలనీ వద్ద పంచాయతీ తాగునీటి కొళాయికి ట్యాప్ ఏర్పాటు చేయకపోవడంతో రోజంతా తాగు నీరు వృథాగా పోతోంది. పంచాయతీ కార్యదర్శి ఉమను వివరణ కోరగా.. విషయం నా దృష్టికి రాలేదు. సోమవారం కొళాయికి ట్యాప్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

– కామేపల్లి, న్యూస్‌టుడే



కష్టకాలం కాదు.. క్రీడల కోసం!

తహసీల్దార్ కార్యాలయం వద్ద పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వారు కాదు. వీరంతా క్రీడల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతున్న చిన్నారుల తల్లిదండ్రులు. పిల్లలు భవనం లోపల చదరంగంలో తలపడుతుండగా వారితోపాటు వచ్చి వేచి ఉన్నారు. చిన్నారుల కోసం భోజనం, తాగునీరు, తినుబండారాలు చేత్తో పట్టుకొని ఇలా వేచి చూస్తున్నారు. ఆదివారం ఖమ్మం ఎస్‌జీఎఫ్ కార్యాలయంలో కనిపించిన దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' కెమెరా క్లిక్‌మనిపించింది.

– ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే



బయట వేచి ఉన్న తల్లిదండ్రులు

గతుకుల దారికి అతుకు వేసేదెన్నడో!

పాలేరు వరద ప్రభావంతో ధ్వంసమైన రహదారి(కాజ్‌వే) నేటికీ కనీస మరమ్మతులకు నోచుకోలేదు. 350 మీటర్ల దారి పాలేరు జలాశయం ఫాలింగ్ గేట్ల ద్వారా వచ్చిన వరద ఉద్ధృతితో పొరలు పొరలుగా ప్రవాహంలో కొట్టుకుపోయింది. వరద తగ్గిన తర్వాత కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో రహదారిపై పేరుకుపోయిన బీటీ పొరలను తొలగించినప్పటికీ రహదారిపై ఏర్పడిన గతుకులను మాత్రం పూడ్చలేదు. ఖమ్మం- సూర్యాపేట ప్రధాన రహదారిగా ఉపయోగపడుతున్న ఈ కాజ్‌వేపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారికి కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. రహదారులు భవనాలశాఖ అధికారులు ఇప్పటికైనా కనీస మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న విషయాన్ని 'న్యూస్‌టుడే' ఆర్అండ్‌బీ ఏఈ దేవేందర్ దృష్టికి తీసుకెళ్లగా కొద్ది రోజుల్లో తాత్కాలిక మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు.



మరమ్మతులకు నోచుకోని పాలేరు రహదారి

– కూసుమంచి, న్యూస్‌టుడే

కరపత్రాల ఆవిష్కరణ

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: మాల మహానాడు నగర కమిటీ సమావేశం నగరంలోని చర్చి కాంపౌండ్ కమ్యూనిటీ హాలులో ఆదివారం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ విషయాన్ని ప్రతి మాల కుటుంబానికి తెలియజేయాలనే ఉద్దేశంతో రూపొందించిన కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. నగరంలోని 60 డివిజన్లలో కరపత్రాలను పంచుతూ డివిజన్ కమిటీలు వేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ గుంతేటి వీరభద్రయ్య, నగర అధ్యక్షుడు తురక నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం మల్లయ్య, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కొట్టె సుధాకర్, ప్రధాన కార్యదర్శి గుమ్మడి కనకరాజు, నాయకులు సత్యం, రాధాకృష్ణ, భాస్కర్, చిన్నప్ప, బాబు, రాములు, సుదర్శన్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మరింతగా సేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవరెడ్డి

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పేదలకు లయన్స్ క్లబ్ సేవలను మరింతగా అందించేందుకు కృషి చేయాలని ఆ క్లబ్ పూర్వ గవర్నర్ ఆచవరపు రాఘవరెడ్డి తెలిపారు. ఖమ్మం గట్టయ్య సెంటర్‌లోని లయన్స్ భవన్‌లో లయన్స్ క్లబ్ రీజియన్ సమావేశం నిర్వహించారు. ప్రపంచంలో అతి పెద్ద ఎన్‌జీఓ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మున్నేరు వరద బాధితుల సహాయార్థం రూ.10 వేల డాలర్లను అందించిందని గుర్తు చేశారు. అవసరం ఎక్కడ ఉంటే అక్కడ క్లబ్ సభ్యుడు సేవ అందించాలని కోరారు. అనంతరం క్లబ్ సేవా కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. సమావేశంలో రీజియన్ ఛైర్మన్ డి.పూర్ణచందర్‌రావు, సభ్యులు ఉంద్రు శ్యాంబాబు, కాకర్ల మల్లికార్జున్ రావు, పాయల నాగేశ్వరరావు, కొంకిమళ్ల విశ్వేశ్వరరావు, మేకా దుర్గానాగేశ్వరరావు, కొదుమూరి లక్ష్మణమూర్తి, కొల్లూరి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమను ఆదుకుంటాం: తుమ్మల

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: గ్రానైట్ పరిశ్రమను ఆదుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన ది ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్‌కు ఎన్నికైన నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మైనింగ్ రాయల్టీ, కొత్త క్వారీల లీజులు, రాయితీల విడుదలకు కృషి చేస్తానన్నారు. గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఐక్యంగా ఉండాలని, ఏకగ్రీవంగా కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు సంఘం జిల్లా అధ్యక్షుడిగా పాటిబండ్ల యుగంధర్, కార్యదర్శిగా కమర్తపు గోపాలరావు, కోశాధికారిగా పరమేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్యాంప్రసాద్ ముఖర్జీ, తమ్మినేని సాగర్, సంయుక్త కార్యదర్శులుగా రియాజ్, రాంమూర్తి, కార్యనిర్వాహక సభ్యులుగా స్వేధన్, అనిల్‌కుమార్, లాల్ ప్రతాప్, రవికుమార్, రాజగోపాల్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, రాయల నాగేశ్వరరావు, సాధు రమేశ్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకటరమణ, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రానైట్ పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, వేదికపై ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్యే కూనంనేని, ఎమ్మెల్సీ తాత మధు తదితరులు

'ఎస్సీ వర్గీకరణ హామీ అమలు చేయాలి'

ఖమ్మం గ్రామీణం: ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వ హామీని అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంగూరు ఆనందరావు డిమాండ్ చేశారు. కొండాపురంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నూతన కమిటీల నిర్మాణ సదస్సును ఆదివారం నిర్వహించారు. ఆనందరావు మాట్లాడుతూ 25న మంద కృష్ణ ఖమ్మం జిల్లా పర్యటన జయప్రదం చేయాలని కోరారు. వీరబాబు, వంశీ, కిషోర్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో యాచకుడి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో ఓ యాచకుడు మృతి చెందాడు. ప్రభుత్వ రైల్వే పోలీస్‌స్టేషన్(జీఆర్పీ) పోలీసుల కథనం ప్రకారం.. రైల్వేస్టేషన్‌లో ఓ గుర్తు తెలియని వృద్ధుడు(70) యాచక వృత్తి చేస్తున్నాడు. వృద్ధాప్యంతో పాటు అనారోగ్య సమస్యలతో ఆదివారం ఉదయం రెండో ప్లాట్‌ఫాం కాలినడక వంతెన సమీపంలో సహజ మరణం పొందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అన్నం సేవా ఫౌండేషన్ నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం సర్వజనాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాస్ తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని, ఎవ్వరికైనా వివరాలు తెలిస్తే జీఆర్పీ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

తెల్దారుపల్లి విద్యార్థిని ప్రతిభ

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి కళాఉత్సవ్-2024 పోటీలకు తెల్దారుపల్లి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఎం.శ్రీజ ఎంపికైనట్లు పాఠశాల ఆర్ట్ ఉపాధ్యాయుడు పాము నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో 'త్రీడీ ఆర్ట్ ఫాం' విభాగంలో ఎం.శ్రీజ ప్రథమ స్థానం సాధించి నవంబరు 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎం.శ్రీజ పాల్గొననుంది.

హైదరాబాద్ వెళ్లిన ఏఈఓలు

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈఓ)లు ఆదివారం ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్లారు. ఇందుకోసం తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల రాష్ట్ర సంఘం సోమవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసింది. ఆ సమావేశంలో ఏఈఓలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చిస్తారు. సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్.నాగుల్ మీరా, జిల్లా బాధ్యులు శ్రీకాంత్, మహేశ్, వెంకటేశ్, ఆయేషా, మౌనిక తదితరులు ఉన్నారు.

ఘనంగా అట్లతద్దె

కామేపల్లి: అట్లతద్దె వేడుకలను పింజరమడుగులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గౌరీదేవికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. వివాహిత మహిళలు నోములు నోచుకొని ముత్తయిదువులకు వాయనాలు ఇచ్చారు. అనంతరం ఉయ్యాలలు ఊగుతూ ఆనందంగా గడిపారు.

'నాగబత్తిని సేవలు మరువలేనివి'

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: కళారంగానికి ఖమ్మం కళా పరిషత్ అధ్యక్షుడు నాగబత్తిని రవి అందించిన సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం రవి 75వ జన్మదిన వేడుకను నిర్వహించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ గంగరాజు, భద్రాద్రి బ్యాంకు ఛైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి తదితరులు రవి సన్మానించారు. కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు సీసీఐ కొనుగోళ్లు ప్రారంభం

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: గుర్రాలపాడులోని జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఉదయం ప్రారంభించనున్నట్లు మద్దులపల్లి మార్కెట్ కార్యదర్శి ఆంజనేయులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నగరంలో సినిమాలు..	**శ్రీతిరుమల:** దేవర పార్ట్-1 **వినోద:** జనక అయితే గనక
	కేపీఎస్: రాధేకృష్ణ, **శ్రీనివాస:** వేట్టయన్
	శ్రీసాయిరాం: విశ్వం, **సీఎన్ సినీ మ్యాక్స్:** ఇద్దరు

ఏ క్రీడల్లో ఎందరున్నారో ఎవరికెరుక!

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

'ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి తెలుసు' అనే నానుడి పాతబడిపోయింది. 'ఏ క్రీడాంశంలో ఎంత మంది క్రీడాకారులు ఉన్నారో ఎవరికి తెలుసు' అని కొత్తగా చెప్పుకునే రోజులు వచ్చాయి. రాష్ట్రస్థాయి పోటీలు పాత పది తెలంగాణ జిల్లాల పరిధిలోనే జరుగుతున్నాయి. నేటికీ విధానంలో మార్పులేదు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు విడివిడిగా క్రీడలు నిర్వహించుకున్నప్పటికీ రాష్ట్ర పోటీల్లో పాల్గొనే ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టును ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఆ క్రమంలో ఎంపిక పోటీలను పాఠశాల క్రీడా సమాఖ్య నిర్వహిస్తోంది. ఏ క్రీడాంశంలో ఎంతమంది క్రీడాకారులు ఉన్నారని అంచనా వేయడం ఓ సవాలుగా మారింది. ఎంపికలు ఒక్కరోజులో పూర్తి కావాలి. వందల సంఖ్యలో క్రీడాకారులు వస్తున్నారు. ఈ పరిణామంతో నిర్వాహకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.



చదరంగం పోటీల్లో చిన్నారులు

ఏం వస్తారులే అనుకుంటే...

ఆదివారం ఖమ్మం స్కూల్‌గేమ్స్ కార్యాలయ భవనంలో అండర్ 14, 17, 19 చదరంగం బాల, బాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. చెస్‌లో ఎవరొస్తారూ అనే ఆలోచనతో ఈ అంశం పోటీలు ఇక్కడ నిర్వహించారు. ఊహకు అందని విధంగా 200 మందికి పైగా పిల్లలు వచ్చారు. ఉన్న 8 గంటల సమయంలో వీరందరికీ పోటీలు నిర్వహించి జట్లను ఎంపిక చేసేందుకు నిర్వాహకులకు ముచ్చెమటలు పట్టాయి. చదరంగం నిపుణుడు, శిక్షకుడు గోపికృష్ణ రంగంలోకి దిగి తొలి రౌండ్ పోటీలు నాకౌట్ పద్ధతిలో నిర్వహించి మిగిలిన ప్రతిభావంతులకు రౌండ్ రాబిన్ లీగ్ పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఇదే పరిస్థితి ఖమ్మం స్టేడియంలో నిర్వహించిన బాస్కెట్‌బాల్, ఖోఖో, స్కేటింగ్ అంశాల్లోనూ కొనసాగింది. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నర్సింహమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయుల బృందం పరుగులు పెడుతూ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టారు.

నూతన దంపతులకు నేతల దీవెనలు



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న తుమ్మల

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: మాజీ శాసన సభ్యుడు సండ్ర వెంకటవీరయ్య కుమారుడు భార్గవ్ వివాహ రిసెప్షన్‌లో పలువురు నేతలు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సీ తాతా మధుసూధన్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. కొరట్లగూడెం గ్రామానికి చెందిన మహిళ మనస్తాపంతో నేలకొండపల్లి వద్ద సాగర్ కాల్వలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు 108లో నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

నిర్మాణ సామగ్రి చోరీ

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: పైనంపల్లి వద్ద ఖమ్మం-కోదాడ జాతీయ రహదారి నిర్మాణ ప్రాంతంలో ఇనుప సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు శనివారం చోరీ చేశారు. దీనిపై పవర్‌మెక్ సంస్థ ప్రతినిధులు ఠాణాలో ఆదివారం ఫిర్యాదు చేశారు. చోరీ సామగ్రి విలువ రూ. లక్ష ఉంటుందని ఫిర్యాదులో తెలిపారు. ఎస్సై సంతోష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూచిపూడి నృత్యంలో ప్రతిభ

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరానికి చెందిన చిన్నారులు కూచిపూడి నృత్యంలో ప్రతిభ చాటి పురస్కారాలను గెలుచుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట మండలం వేదాద్రిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో శ్రీమువ్వా గోపాల కల్చరల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం 'నృత్యోత్సవం' కార్యక్రమం నిర్వహించారు. మమతా దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ జి.వెంకటేశ్వరరావు, అనితా రావు దంపతుల కుమార్తె జి.మాన్వి కూచిపూడి నృత్యం చేసి ఆకట్టుకుంది. చిన్నారికి నిర్వాహకులు 'నాట్య కుసుమ' పురస్కారంతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారు. బ్యాంకు కాలనీకి చెందిన పొన్నెకంటి జానకి ప్రియ కూచిపూడి నృత్యంలో ప్రదర్శన ఇచ్చి ప్రతిభ చాటింది. నిర్వాహకులు చిన్నారికి 'నాట్య కళాబ్రహ్మ' పురస్కారం ప్రదానంతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారు. పలువురు చిన్నారులను అభినందించారు.



పురస్కారాలు అందుకుంటున్న జి.మాన్వి, పి.జానకిప్రియ

'మతం పేరుతో చిచ్చుపెడుతున్న భాజపా'

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన భాజపా ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టి అల్లకల్లోలం సృష్టిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. నగరంలోని రాపర్తినగర్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఎం 58వ డివిజన్ పార్టీ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు.. భాజపా, ఆరెస్సెస్ కవల పిల్లలని, ఆరెస్సెస్ ఆదేశాల మేరకు మతోన్మాద శక్తులు మైనార్టీలపై దాడులు చేస్తున్నాయని మండిపడ్డారు. హిందుత్వం పేరుతో మత రాజకీయాలు చేస్తూ హిందువులపై అదనపు ఆర్థిక భారం మోపడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో ప్రముఖ న్యాయవాది గంగాధర్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, రెండో పట్టణ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, మాజీ కౌన్సిలర్ నర్రా రమేశ్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

పాత పద్ధతిలోనే గ్రూప్-1 పరీక్ష నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇటికాల రామకృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ప్రభుత్వం జీఓ 29ని రద్దు చేసి పాత పద్ధతిలోనే గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో జీఓ 55 ప్రకారమే మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని, ఆన్సర్ బుక్‌లెట్‌లో యూపీఎస్సీ తరహాలోనే ప్రిలిమ్స్ హాల్ టికెట్ నంబర్ ముద్రించి అభ్యర్థులకు అందించాలని డిమాండ్ చేశారు. అభ్యర్థుల సందేహాలను టీజీపీఎస్సీ, ప్రభుత్వం నివృత్తి చేయాలని కోరారు. కోర్టు కేసులు లేకుండా అభ్యర్థుల సమస్యలను పరిష్కారం చేసి ఎలాంటి వివాదాలు లేకుండా పకడ్బందీగా పరీక్ష నిర్వహించాలని కోరారు. సమస్యను పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేసిన అభ్యర్థులపై లాఠీఛార్జి చేయడం దుర్మార్గమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు మద్దోజు శ్రవణ్, వంశీ, రాకేశ్, ప్రతాప్, సునీల్, గోపి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక నిపుణుల నియామకంపై కొత్త వివాదం

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

నగరపాలక సంస్థలో ఎల్ఆర్ఎస్-2020 దరఖాస్తుల పరిశీలనకు కొత్తగా పది మంది సాంకేతిక నిపుణులను తీసుకోవాలని అధికారులు నిర్ణయించడం వివాదాస్పదంగా మారింది. మూడేళ్లుగా నగరపాలకంలో ఐదు నుంచి పది మంది సిబ్బందిని పాలకవర్గం అనుమతి లేకుండా రూ.వేలాది వేతనాలు చెల్లించారు. ఇటీవలే విషయం మేయర్ దృష్టికి వెళ్లడంతో వారికి వేతనాలు ఇచ్చేందుకు నిరాకరించారు. ఈ తరుణంలో ఐదు నెలలుగా వారికి వేతనాలు చెల్లించడం లేదు. దీంతో తర్జనభర్జన పడిన అధికారులు తిరిగి వారినే నియమించుకునేందుకు వారికి అనుకూలంగా ఉండే నిబంధనలతో టెక్నికల్ ఆఫీసర్ నియామకానికి జిల్లా ఉపాధి కల్పన శాఖ ద్వారా నియామకానికి ప్రకటన జారీ చేయడం అనుమానాలకు తావిస్తోంది. దరఖాస్తుదారులకు బీటెక్ సివిల్ తోపాటు ఏదైనా పుర, నగరపాలకంలో ఒక సంవత్సరం పని చేసిన అనుభవం ఉండాలని, వారికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. ఏడాది అనుభవం ఉన్న వారిని మాత్రమే తీసుకోవాలన్న నిబంధన పాతవారినే తిరిగి తీసుకునేందుకు విధించారన్న వాదన ఇతర అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. బీటెక్ సివిల్ ఉన్న అభ్యర్థులు ఈ పనులు నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ పుర, నగరపాలకాల్లో ఓ ఏడాది పని చేసిన వారికి ప్రాధాన్యం ఇస్తామన్న నిబంధన తమకనుకూలమైన వారికి కేటాయించేందుకు విధించినట్లు ఉందని పలువురు అర్హులైన అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నగరపాలకంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల కోసం ఏర్పాటు చేసిన కేంద్రం

పలువురిపై ఆరోపణలు

గతంలో ప్రణాళిక విభాగంలో పని చేసిన సిబ్బందిపై ఆరోపణలు ఉండటం విశేషం. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు ఫోన్ చేసి స్థలాన్ని చూపే సమయంలోనే రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేసేవారన్న ఆరోపణలు ఉన్నాయి. అలా ఇచ్చిన వారి దరఖాస్తులను మాత్రమే రెండో దశకు పంపినట్లు తెలుస్తోంది. పది మంది సిబ్బంది తాత్కాలిక పద్ధతిన నియమించి, వారికి రూ.వేలాది చెల్లించినప్పటికీ 39 వేల దరఖాస్తుల్లో కేవలం 15 వేలు మాత్రమే పరిశీలించడం వారి పనితీరును స్పష్టం చేస్తోంది. ఇక ఉన్నతాధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.